# నల్లమబ్బులు

చూస్తూ చూస్తూ వుండగానే ఆకాశం కాటుక పూసుకున్నట్టు నల్లగా మారిపోయింది. ఎదర బోలెడు పొద్దువుండగానే లోకాన్ని చీకటి కమ్మేసింది. నేలమీద చెమ్మ ఆరనేలేదు. మళ్ళీ చినుకు ప్రారంభం అయిపోయింది. సీతామహాలక్ష్మి పిల్లను ఒళ్ళో వేసుకుని, పొదివిపట్టుకుని గుండెలు చేతుల్లో పెట్టుకు కూచుంది. ఏం దారీ? వినాయకచవితి ముందు పట్టుకున్న ముసురు దసరా వెళ్ళినా వదలకుండా వున్నాది. ఈ దిక్కుమాలిన వాన కొంపకూల్చిందే వొదల్దుగావును. ఈ ఇల్లు చూస్తే అన్ని గదులూ కురవడమే వీధి వరండా గావును కురవదు. ఇల్లు గలాయనకి అద్దె ఠంచన్‌గా కావాలి. ఇంట్లో వున్న వాళ్ళు ఎన్ని చంకలు నాకితే అతనికేం గావాలీ? ఒక కష్టం, సుఖం వింటాడా? ఫస్టు వచ్చిందంటే అద్దె డబ్బులకి అరక్షణం ఆగడు.

పెద్దవాడు చినుకులకి బుర్ర తడవకుండా పలకాపుస్తకాలూ తలమీద పెట్టుకుని నిక్కరు ఎగదీసుకుంటూ పరుగు పరుగున వచ్చి వీధి అరుగుమీదికి ఒక్క గంతు వేశాడు. వాడి ప్రాణానికి ఆ పరుగు ఎక్కువే, రొప్పుతూ తిన్నగా తల్లిదగ్గిరకి వచ్చాడు.

" అమ్మా! ఆకలేస్తున్నదే " అన్నాడు. వాడు.

సీతామహాలక్ష్మి పిల్లని చంక దింపి, వాడికింత అన్నం పెట్టింది. ఆడేపాడే కుర్ర వెధవ. టిఫిన్లు చేసి పెట్టాలనే వుంటుంది. కాని ఎక్కడ కుదురుతుంది? అడిగినప్పుడల్లా పెట్టడానికింత అన్నం అయినా వున్నది. అదీ లేని సంసారాలెన్ని లేవు?

వానజడి హెచ్చింది. బడబడా బాదేస్తుంది. కిటికీల్లోంచి జల్లు కొట్టేస్తుంది. ఆ కిటికీకి ఒక రెక్క విరిగిపోయింది. గోనె ముక్క తగిలించాలి.

కొండంత ఎండకయినా వోర్చుకో వచ్చునుగాని- చిన్న మెత్తు చినుక్కు వోర్చలేమంటారు ఇదే గావును.

వెధవ్వాన - వెధవ్వానని. ఏనాడయి ప్రారంభమయింది! వొదల్దు - ఒకంతట. జలగలాగా పీల్చిపీల్చి పిప్పి చేస్తేనేగాని వూరుకోదు గావును. ఏందారి తండ్రీ .... ఈ రకంగా వాన కురుస్తూంటే పంటలు సర్వనాశనం అయిపోవూ? యిప్పటికే ధరలు మండి పోతున్నాయి. నెలనెల ఎంతోకంత జీతం డబ్బులొస్తున్న సంసారాలే యిలా యీడిగిలపడిపోతున్నాయిగదా - పూటబత్తెంపుల్ల వెలుగు బ్రతుకులు..... మరి వాటి గతి ఏమిటి?

సీతామహాలక్ష్మి యింటి కప్పుకేసి చూసింది. జల్లెడల్లే వుంది. తన సంసారంటాగే వుంది. పెరిగిన వానకి ఒకటి రెండు చోట్ల పెద్ద ధారే కారుతుంది. విరిగిపోయిన ప్లాస్టిక్ బకెట్ పట్టుకెళ్ళి ఎక్కువగా కురుస్తున్న చోట పెట్టింది. బుడబుడ ధార పడిపోతుంది. కుర్రవెధవకదొక వినోదంగా వున్నట్టుంది. అన్నం తినడం మానేసి అటే చూస్తూ కూచున్నాడు.

ఏం చెయ్యడానికీ పాలుపోకుండా వున్నది. బొగ్గులు నెమ్ముకు పోయాయి. స్టౌలో వత్తులు కాలిపోయి పొట్టివయిపోయినట్టున్నాయి. సమంగా వెలక్కుండా వున్నాయి. కీడిదీపంలా మంట వస్తోంది. కాఫీ కాగడానికే గంట సేపవుతోంది. మరిహను వంటెప్పటికయ్యేను? ఏం చేస్తుంది. వంట చెయ్యాలంటే ప్రాణ సంకటంగా వుంది.

పెద్దవాడు పెట్టిన నాలుగు మెతుకులూ తిని చొక్కాతో మూతి తుడుచుకుంటూ వీధి వరండాలోకి వెళ్ళాడు.

ఏం వంట! నా మొహం వంట కూరగాయల ధరలు మండిపోతున్నాయి. వంకాయలు కేజీ రూపాయిన్నరట! హవ్వ! ఎవరయినా వింటే నవ్వుతారు. ఈ పల్లెటూళ్ళోనే ధరిలిలా మండిపోతుంటే వైజాగ్ లాంటి బస్తీల్లో అయితే ఇంకా అడిగేవా! ఈ జీతం నిండా వారం రోజులు రాదు.... పెళ్ళయిన కొత్తలో బేడ వంకాయలు తెస్తే రెండు పూటలకీ సరిపోను కూర అయ్యేది. పావలాకి నాలుగు అరటికాయలిచ్చేవారు. యిప్పుడో రూపాయకి నాలుగట. కరువు- మండిపోతున్నాది.

సీతామహాలక్ష్మి లేచి యిన్ని చిత్తు కాగితాలు తీసి బొగ్గుల కుంపటి ముట్టించింది. యిల్లంతా కాగితాలు కాలిన వాసనా, పొగానూ, చంటిది ఏడుపు లంకించుకుంది.

"సుందరం ! చెల్లిని ఎత్తుకోనాయనా" అని పిలిచింది సీతామహాలక్ష్మి, కళ్ళు మండుతుంటే ముక్కు చీదుకుంటూనూ.

వాడు వీధరుగుమీద నిలబడి కాయితం పడవలు నీళ్ళల్లో పడేస్తూ వినోదిస్తున్నాడు. ఇల్లు పల్లంగా వుంది. ఇక్ష్వాకుల కాలం నాటి కొంప. యింటిచుట్టూ నీరు నిలబడివుంది. రోడ్డు మీదనించి యింటి గడపవరకూ నాలుగయిదుచోట్ల ఇటుకముక్కలు పేర్చి దారి చేసుకున్నారు.

"ఇల్లు మార్చేయండి బాబూ అని ఎంత పోరు పెడుతున్నా వినిపెంచుకోరుగదా. ఇళ్ళద్దెలు మాత్రం ఏం తక్కువ? పెళ్ళయిన కొత్తలో విజయనగరంలో పుత్సలవీధి సెంటరులో-25 రూపాయలకి ఎంత యిల్లు? నిజమే, పదేళ్ళు దాటింది లెండి. అయితేమట్టుకు- గదీ, వసారా, ముందు వరండాకి కటకటాలు - మధ్య వన్నారా- వెనక, వంటకి సాల - బోరింగ్ పంపు - యిన్నీ వుండేవి - ఇప్పుడీవూళ్లో ఇది పల్లెటూరు కాదు పట్నమూకాదు ఎనభయి రూపాయిల అద్దె పోస్తున్నా ఆ యిమ్ము యేదీ? అప్పటికీ ఇప్పటికీ యిద్దరు పిల్లలు పెరిగారు. ఈ మాయ దారి యింట్లో ఒకటే కాస్త పెద్దగది. దాంట్లోనే అన్నీను. సామాన్లూ అందులోనే. పడకలూ అందులోనే. ఎవరయినా ఇరుగమ్మా పొరగమ్మా వచ్చినా చాప వేసి కూచోబెట్టి మాట్లాడ్డం అందులోనే. చుట్టమూ పక్కమూ వచ్చినా అందులోనే.... ఎదర మారెడు అరుగు. కటకటాలన్నా లేవు. ఇదిగో వెనక ఈ వంటగది. దీని పరిస్థితి చూడగా ఏ నిమిషానన్నా కూలిపోయేలా వుంది. కారని చోటు లేదుగదా కొంపలో.... "

ఎవడు వింటాడీ అరణ్యారోదనం? విన్నా ఎవడు పరిష్కరించగలడీ విషమసమస్యల్ని?

గత వారం పడిన పెద్ద వానకి ఇంటి చుట్టూ చేరిన నీరు చూసి ఎంత భయం వేసిందో సీతామహాలక్ష్మికి! తమ బ్రతుకులు కూడా యిలాగే నడి సముద్రంలో నావలాగా అల్లల్లాడుతున్నట్టే వుంది.

వంట అయిందనిపించింది. అంకెంముక్క తెచ్చి ఇల్లంతా వొత్తింది. ఆరున్నరయింది. చినుకు జడి తగ్గించి. చిన్న చిన్న తుంపర.

సుబ్బారావు గొడుగు వేసుకుని వచ్చాడు. గొడుగు విప్పి వీధి అరుగు మీద దూలానికి వేలాడదీశాడు. పెద్ద సైజు గబ్బిలం తలకిందులుగా వేలాడుతున్నట్టుంది. నిరుపేదకన్నీటిలా గొడుగు కొస నుంచి నీరు ఓడుతోంది. ఇంట్లోకి వచ్చి బట్టలు మార్చుకున్నాడు.

"ఆ చాకలి చచ్చినాడికి కబురు పెట్టలేకపోయావా? యింట్లో బట్టలు మురిగి పోతున్నాయి. ఏ సర్ఫో పెట్టి ఉతుకుదామా అంటే ముసురొకటి వొదలకుండా వున్నది." అన్నది సీతామహాలక్ష్మి వంట గదిలోంచే, మొగుడు రావటం కనిపెట్టి.

"ముసురిలా తినేస్తుంటే వాడు మాత్రం ఎలా ఉతుకుతాడూ?" అందా మనుకున్నాడు. కాని వెంటనే, " కబురు పెట్టాను - రెండు మూడు రోజుల్లో తప్ప కుండా పట్టుకొస్తానన్నాడు " అనిబొంకాడు సుబ్బారావు. అంతా వుట్టిదే. ఇప్పుడు సీతాలు చెప్పిందాకా ఆ సంగతే మర్చి పోయాడు.

అతగాడిక్కూడా ఏం. చెయ్యడానికి పాలుపోకుండా వున్నది. మొన్నటేడు మారిన స్కేలు ప్రకారం ఆరువందలొస్తుంది మళ్ళీను. కటింగులు పోనూ అయిదువందల అరవయి చేతికొస్తుందే అనుకుందాం- మొగుడూ పెళ్ళాం యిద్దరు పిల్లలకి చాల్టంలేదు. ఒక అరవయి రూపాయిలు మాత్రం ప్రతి నెలా యింటికి పంపిస్తాడు. పై రాబడీ యేగాణీవుండదు ' దేనికైనా రాసిపెట్టయినా వుండాలి - చేతనైనా అయ్యుండాలి మీకు రెండూ లేవు, అంటుంది సీ.మ.ల. ఈ జీతపు రాళ్ళల్లోనే ఇంటద్దె, పాలు! తిండి ఖర్చు, చదువులు, చుట్టాలు, సినిమాలు, మందులు, బట్టలు - ఇంకా ఎన్నుండాలో అన్నీ అందులోనే.

మొన్ననో యిల్లు చూశాడు కొత్త వీధిలో. చాలా బావుంది. ముందువరండా రెండు గదులూ, వంటిల్లూ - కొద్దిపాటి పెరడు, సెపరేట్ బాత్రూమ్, లెట్రిన్. నాలుగు వాటాల వాళ్ళకి కలిపి ఒక కొళాయి. మరి నుయ్యి లేదు. పైన డాబా ఎంత ముచ్చటేసిందో! కాని నూటపాతిక. ఇదే వైజాగ్ అయితే రెండువందలుండొచ్చు. ఇంకా ఎక్కువే వున్నా ఆశ్చర్యపోనక్కరలేదు. ఈ ఊళ్ళో అది కొంచెం ఎక్కువే. నాలుగోనాడు మళ్ళీ అటువేపు వెళ్ళేసరికి ఎవరో దిగనే దిగిపోయారు. లేకపోతే తనుగాని అందులో దిగబోయాడా ఏమిటిగాని! తన బోటి సామాన్య యు.డీ. గుమస్తాకి అది ఎక్కువే. మరో రెండు మూడేళ్ళలో సూపర్నెంటు ప్రమోషన్ రావాలి. అప్పుడెలా వుంటుందో. అప్పుడూ అంతే. నూటయాభై రూపాయిల్లో టైపిస్టుగా జాయిన్ అయ్యాడు. ఓ ఏడాది తరవాత గుమస్తాగా మారిపోయాడు. ఇప్పుడలా అలా ఆరువందల చిల్లర వరకూ దేకేడు. అప్పుడెలా వుందో ఇప్పుడూ అంతే. ధరలు జీలాలకంటే ముందు పెరిగిపోతుంటే ఇహనేం చెయ్యడం. ?

చంటిదాన్నెత్తుకుని సీతామహాలక్ష్మి వంటగదిలోంచి బైటికొచ్చింది. తండ్రిని చూడగానే చంటిపిల్ల మాలతి చేతులు చాపుతూ దగ్గిరకొచ్చింది. సుబ్బారావు కూతుర్ని ఎత్తుకుని కిటికీ వార కుర్చీలో కూర్చున్నాడు.

"వొరే సుందరం అలా గోళ్ళు గిల్లుకుంటూ కూచోకపోతే చదూకో కూడదురా–"

సుందరం చెడ్డీ ఎగదీసుకుంటూవచ్చి పెట్టెలపక్క కూచుని ఎక్కాలు చదవటం ప్రారంభించాండు. వాడు మూడవ తరగతి చదువుతున్నాడు.

సీతామహాలక్ష్మికేసి చూశాడు సుబ్బారావు. పెళ్ళయిన కొత్తలో పుష్టిగా ఎంత బావుండేదీ! పదేళ్ళ కాపరం–పదేళ్ళేమీ– వచ్చే మార్చికి పదకొండేళ్ళు కూడా నిండిపోతాయి. ఇద్దరు పిల్లలు మధ్యలో ఒక కాన్పు పోవడం – మనిషి ఈనిపుల్లలా అయిపోయింది. చక్కనమ్మ చిక్కినా అందమే. పెళ్ళయిన కొత్తలోకంటే ఇప్పుడే అందంగా కనిపిస్తుంది. ఒక ఛాయ తగ్గిందికూడాను. ఒక్క క్షణం సీతాల్ని రెప్ప వెయ్యకుండా చూశాడు. కాసేపటికి భార్య కట్టుకున్నది వెలిసిపోయిన చీర అని గ్రహించి మనస్సు చివుక్కుమంది. భార్యకికాస్త ఖరీదయిన చీర కొందామంటే అవ్వకుండా వుంది. గత సంక్రాంతికి కొందామనుకున్నాడు. అయ్యిందికాదు. ఉగాదికి చుట్టాలు. పై వాళ్ళు కాకపోవచ్చు. అయ్యే ఖర్చు తప్పిపోదు. ఎన్నెన్నో ఊహించుకుని తెచ్చిన రెండువందల యాభయి రూపాయల పండగ అడ్వాన్సూ "హూష్కా"కి అని మాయం అయిపోయింది. స్టీలు కారియరూ, చారు పోసుకుందుకు గోకర్ణం కొనాలని సీతాలు ఎన్నాళ్ళనుంచో కలలుకంటోంది. కావాలంటే తను చాన్నాళ్ళనుండి పోగు చేసుకున్న పాతిక రూపాయలు కూడా యిచ్చేస్తానని వొప్పుకుంది. ఏం లాభం-ఆఖరికి నలభయ్యారు రూపాయలు పెట్టి

సాదా చీరే కొనుక్కుంది హైకోఫాబ్రిక్స్‌లో. తనకే ప్రాణం వుసూరుమనిపించింది.

"ఏమిటలా ఆలోచిస్తూ కూచున్నారు? భోజనాలు చేద్దాం రండి. బియ్యం రేపు ఉదయానికొస్తాయి. నూనె కూడా ఓ అరకేజీ తెస్తేగాని కాదు."

"ఫస్టు తారీకింకా ఆరు రోజులుంది" అన్నాడు. కాదు స్వగతంగా అనుకున్నాడు. "సరేలే- రేపుదయం తెస్తాను" అన్నాడు ప్రకాశంగా.

భోజనాలయ్యాయి. ఏమున్నాయి గనక పంచభక్ష్య పరమాన్నాలు? అరటి కాయ వేపుడూ. పప్పుచారూనూ. వేయించిన చల్ల మిరపకాయలు మాత్రం గొప్ప రుచిగా వున్నాయి. పిల్లలిద్దరూ పట్టిమంచం మీద పడుకున్నారు. సీతామహలక్ష్మి పెద్ద మంచం మీద పడుకున్నది. సుబ్బారావు పాత పత్రిక చదువుతూ కూచున్నాడు. ఏం ముండా కథలు ఒక్కటీ నచ్చడంలేదు. ఎలా అచ్చయిపోతున్నాయో! ఎలా బహుమతులుకూడా వచ్చేస్తున్నాయో.... మళ్ళీ వాన జోరుహెచ్చింది . పిడుగులు. సీతాలు జడుసుకుని లేచి కూచుంది. సుబ్బారావు వెళ్ళి పక్కన కూచున్నాడు ఆనుకుని.

"అబ్బా ఎంత భయం వేసిందో" అన్నది సీతామహలక్ష్మి. గుండెలు దడదడా కొట్టుకుంటున్నాయి. సుబ్బారావు ఒక్క క్షణం చూపు నిలిపాడు. హోరునపైన వాన. లోపల యిద్దరూ అలా దగ్గిరదగ్గిరికి ఆనుకుని కూచునేసరికి సుబ్బారావుకి మనసంతా మధురం మధరం అయిపోయింది. జ్ఞాపకాలు, జ్ఞాపకాలు. ఎంత మధురంగా వుండేవి అప్పటి రోజులు. తనకప్పుడు యింక్రిమెంటుతో కలిపి నూటఅరవయి రూపాయిలు జీతం. అందులో పది రూపాయలు ప్రావిడెంటు ఫండ్ పోనేపోయేది. మరో రెండురూపాయలు స్టాఫ్ అసోసియేషన్ కని యిచ్చేవాడు. అక్కడికిక మిగిలినవి నూట నలభయి ఎనిమిది రూపాయిలే. అప్పటికి నాన్నగారు ఉద్యోగం చేస్తున్నారు, గనక యింటికి డబ్బులు పంపవలసిన అవసరం ఏమీ ఉండేదికాదు. హాయిగా గడిచేవి రోజులు. వెన్నెల రాత్రులలో సెకండ్‌షోకి వెళ్లేవారు. నడివీధుల్లో చట్టాపట్టాలు వేసుకుని నడుస్తూ- వీధి మలుపు చీకట్లో ముద్దులు పెటుకునేవారు. ఆకాశమే కప్పు, చంద్రుడే సాక్షి, చుక్కలే తోడు, చెట్లే నీడ. అబ్బ అలా ఆరుబయట ముద్దులు పెట్టుకుంటే ఎంత బావుండేది! అదో త్రిల్!

గంట సేపాయి ఒకటేవాన. కుండపోతగా కురుస్తుంది. సీతాలు ముడుచుకుని- మొగుడిచుట్టూ చేతులు వేసుకుని గట్టిగా పట్టుకుని, కళ్లు మూసుకుని పడుకుంది. సుబ్బారావు ఆ వెచ్చదనాన్ని అనుభవిస్తూ అలా కూచునే వున్నాడు. వెర్రివాడిలాగా, అతగాడికి నిద్ర రావడం లేదు.

అలాటివి మరో రెండుమూడు గట్టి వానలు పడితే వంటగది కుడిచెంప కూలి పోక తప్పదు. ఆ యిల్లు గలాయనతో ఎన్నిసార్లు చెప్పినా వినడు. ఎరియర్ బిల్సు కొన్ని రావల్సినవి వున్నాయి. అవి వస్తే కొంత దరిద్రం తీరిపోను. గత ఏడాది చేయించుకున్న ఫామిలీ ప్లానింగ్ ఆపరేషన్ తాలూకా ఇంక్రిమెంటు నానా పుత్రాకులూ పడితే శాంక్షన్ అయింది. ఆ ఏరియర్స్ యింకా డ్రా చెయ్యాలి. మొన్న మే నెలలో ఆఫీసు పనిమీద హైదరాబాద్ వెళ్ళిన టి.ఏ. బిల్ కూడా యింకా సొమ్మవలేదు. ఆ రెండూ కలిపి అయిదు వందలవరకూ రావాలి. ఎక్కడికక్కడే పెర్సంటేజీలు యివ్వలేక ప్రాణం కడెట్టుకుపోతున్నది. ఈ దేశం బాగుపడదు. గవర్నమెంటుసొమ్ము అంతతొందరగా వస్తుందా? ఛీఛీ- ఏం గవర్నమెంటుద్యోగం- ఆఖరికి ఏ కిళ్ళీకొట్టు పెట్టుకున్నా తీరిపోను, సుబ్బారావు తోడల్లుడికి విశాఖపట్నం మెయిన్ రోడ్లో స్టేషనరీ షాపుంది. అంటే తెల్లకాయితాలు, యింకు సీసాలూ, పెన్నులూ, పెన్సిళ్లూ అమ్మేదుకాణం. తర్డుఫారం మూడుసార్లు పోతే వాళ్ళ తండ్రి విసిగిపోయి పెట్టించి కూచోబెట్టాడు. యిప్పుడతగాడి పని బ్రహ్మాండంగా వుంది. పుస్తకాల సెక్షన్ కూడా పెట్టాడట. సీజన్‌లో గవర్నమెంటు టెక్స్ట్ పుస్తకాలు

బ్లాకున అమ్ముతాడు. ఎప్పుడూ జేబులో నోట్లుగా, నోట్లో సిగరెట్టు, సీకోవాచి, ఖరీదయిన బట్టలూ, హిప్పీ జుట్లూ.... మతాబాలా వెలిగిపోతున్నాడు. ఈ దిక్కుమాలిన గవర్నమెంటు ఉద్యోగం ఎన్నేళ్ళుచేస్తే మాత్రం మిగిలేదేముంది! మూడుమూడేళ్ళకీ బదిలీలు- పేకేజిడొక్కులూ- అప్పులూనూ.

ఎప్పుడు నిద్ర పట్టిందో- ఎప్పుడు తెల్లారిందో-

బద్దకంగా లేచాడు. స్నానంచేసికాఫీతాగే సరికి కరకరలాడుతూ ఎండ వచ్చింది. ఇళ్ళ కప్పుల్లోంచి ఆవిరి ఆకాశంలోకి లేస్తుంది. సుబ్బారావుకి పట్టలేనంత సంతోషం వేసింది. కొత్తవీధి జంక్షన్‌లో తాతాజీ దుకాణంలో పద్దు రాయించి పది కేజీల బియ్యమూ, అరకేజీ మంచినూనె తెచ్చి యింట్లో యిచ్చాడు. వీధిలో కొస్తే ఒక పావలా తోటకూర కొన్నది సీతామహలక్ష్మి. పాపం- బాగానే పెట్టాడు తోటకూర. పులుసు చేస్తే ఆ పూటకీ ఈ పూటకీ కూడా గడిచిపోతుంది. రేపటి సంగతి రేపు చూసుకో వచ్చు. వాన తెరిపిచ్చింది. అప్పోసప్పో యింట్లో బియ్యం వున్నాయి. వేడి వేడిగా భోజనం చేసి ఆఫీసుకు బయల్దేరాడు.

" గొడుగు పట్టుకెళ్ళండి "

అన్నది సీతామహలక్ష్మి.

"ఎందుకూ? ఇవ్వాళ వాన రాదు. చూస్తున్నావా ఎండ పటంలా ఎలా వచ్చిందో–మరి ముసాబు వదిలేసినట్టే. ఆకాశంలో అలజడి తగ్గిపోయింది–" అంటూ వీధరుగుమీదకొచ్చి తలపైకెత్తి ఆకాశం వేపు చేశాడు.

"అన్నట్టు గొడుగేది? ఇంట్లో పెట్టావా" అన్నాడు సుబ్బారావు.

గుండె గతుక్కుమన్నది. ఏ దొంగ వెధవయినా కొట్టెయ్యలేదుగదా !

"నేనెందుకు తీస్తానూ – నిన్న సాయంత్రం ఆఫీసునుంచి వచ్చి మీరేకద ఇక్కడ దూలానికి తగిలించారూ–" అని వీధి వరండా మీదచూసింది.

" అవును తగిలించానూ. నీరు వోడుతుందని తగిలించానూ "

" ఇంట్లోనన్నా పెట్టేరు కాదు–"

" ఇల్లంతా కారుతోంది అసలేచమ్మ చమ్మగా వుంటే ఎక్కడ పెట్టమన్నావూ. నాకు మాత్రం బుర్రలేదంటావా" సర్రుమన్నాడు.

సీతాలు కాలుగాలిన పిల్లిలా యిల్లంతా గిరగిరా తిరిగి అన్ని మూలలా వెతికింది. యింకెక్కడి గొడుగు.!

గత నెలలోనే ఇరవయిరెండు రూపాయలు పెట్టి కొన్నాడు. సన్ బ్రాండ్ గొడుగు. ఎవడో పుణ్యం కట్టేసుకున్నాడు. ఏడిస్తే వొస్తుందా, మొత్తుకుంటే వస్తుందా? ఏడవటానికి మొత్తుకోవటానికి కూడా టైం లేదు. ఇప్పుడే పదీ అయిదయింది. ఆఫీసుకు వెళ్ళిపోవాలి.

"ఇదిగో-చూడూ ఓసారి ఇల్లంతా జాగ్రత్తగాచూడు. ఏ మంచాల మూలన్నా పడిందోయేమో-" అంటూ గబగబా రోడ్డుమీదకొచ్చాడు.

"చూస్తానుగాని, మీరుకూడా ఆఫీసులో పెట్టి మర్చిపోయారేమోచూడండి. ఒకవేళ ఎవరికయినా యిచ్చి మర్చిపోయారేమో జ్ఞాపకం తెచ్చుకోండి" అంది లోపల్నించి సీతామహలక్ష్మి గట్టిగా వినిపించాలని.

సుబ్బారావుకి ఏడుపులోంచి నవ్వొచ్చినట్టయింది. ఇద్దరి ఆశలూ నిజమే. వెర్రి! వెర్రి అలా వుంటుంది ఒకో సారి.

సాయింత్రం దాకా ఫెళఫెళలాడుతూ ఎండ కాసింది. ఆకాశంలో ఎక్కడామాడంత మబ్బయినా కనపడలేదు. రోడ్లు కాస్త ఆరుదల పట్టాయి.

సీతామహాలక్ష్మి గబగబా రెండు మెతుకులు తిని బట్టలు తెచ్చి సీదరు మీద ఆరబెట్టి – దగ్గిరే కూచుంది. అలవాలు కొద్దీ నిద్రొచ్చి కళ్ళు కూరుకుపోయినా–బలవతంగా నిద్ర ఆపుకుని అలాగే కూచుంది మూడు గంటలదాకానూ. నెమ్మి పోయి బట్టలు పొడిపొడిలాడుతున్నాయి. దుప్పట్లు వెచ్చగా వున్నాయి. గొడుగు పోయిన దిగులు ఇంకా గుండెలో బరువుగా దిగలాగేస్తుంది. బట్టలన్నీ ఒకటికి నాలుగు సార్లు లెక్కపెట్టి, చేతి మడతలు వేసి బియ్యం ఏరింది. గదులూ వీధిగడపా తుడిచింది. పెరట్లో ఆరబోసిన బొగ్గులు ఎత్తి ఇంట్లో పెట్టింది. కుంపటి ముట్టించి ఎసరు పడేసింది. సుందరం బడినించి వచ్చాడు.

"అమ్మా ఇవ్వాళ మా బడికి మ్యాజిక్‌వాడొచ్చాడు. పెంకు ముక్కల్ని రూపాయిలు చేశాడు. కాలీ సంచిలోంచి లడ్డూలు తీశాడమ్మా–" అంటూ ఉత్సాహంగా చెబుతున్నాడు.

"అదంతా గారడీరా– నిజంకాదు.... కనికట్టు. పెంకు ముక్కలు నిజంగా డబ్బులే చెయ్యగలిగితే వాడికా పాట్లెందుకు చెప్పు–" అంది సీతామహాలక్ష్మి. బ్రతుకే ఒక కనికట్టు.... ఒక పెద్ద అబద్ధం.... మాయ.... అనుకుంది.

"గొడుగు కనిపించిందా?" అంటూ తిన్నగా లోపలికొచ్చాడు సుబ్బారావు.

"ఇల్లంతా మూల మూలనా వెదికేను. మీరు లోపలికి తేవడం మర్చిపోయారు నిన్న సాయంత్రం. ఎవడో చంకన పెట్టుకుపోయుంటాడు"

రూపాయా రెండా? ఇరవయిరెండు రూపాయలు, వస్తువు పోతే మళ్ళీ వస్తువు ఎలా అమురుతుందీ?

ఈ రోజు కాసిన ఎండతో ఇంటి ముందు నీరు చాలామట్టుకు లాగేసి-మురగడి తయారై బుడగలు కట్టింది. కొద్దిగా నీరు వాసనకూడా వొస్తుంది.

అక్కడికి దగ్గిర ఒక అరమైలు దూరంలో ఒక పెద్ద పంటచెరువున్నది. అది చాలా పెద్దచెరువు. ఆ చెరువు నీటితో ఆ చుట్టుపక్కల కొన్ని వందల యకరాలు సాగవుతాయి ఆ చెరువులోకి చుట్టు పక్కల కొండలమీద, మెరక భూముల మీదా పడిన నీరల్లా కొట్టుకొస్తుంది. ఈ ఏడాది దాని నిండా నీరు నిండిపోయింది. వర్షాలు ఇంకా తగ్గకపోతే గండి కూడా పడుతుందేమోనన్నంత ప్రమాదంగా వుంది. ఏం చెయ్యడానికీ వీలుకాని పరిస్థితి....

చాన్నాళ్ళకు సాయంత్రంవేళ పొడిగావుంది. గొడుగు పోయిన దిగులు, మెల్లిమెల్లిగా మర్చిపోవడానికి ప్రయత్నిస్తున్నారు. అలా కొడుకును తీసుకొని రోడ్డు మీదికి వెళ్ళి దీపాలు పెట్టేసరికి తిరిగి వచ్చాడు.

"అమ్మా పకోడీలే–" సుందరం తల్లికి పకోడీల పొట్లం, మల్లెపూల పొట్లం యిచ్చాడు. సీతామహాలక్ష్మి చంటిదానికి నెత్తిమీద కృష్ణుడు జడవేసి నాలుగు మల్లెపూలు చుట్టింది. అది కేరింతలు కొడుతూ ఇల్లంతా పాకుతూ, మంచాలూ గోడలూ పట్టుకొని నడుస్తూ ఆటలాడింది. సీతాలు సగం పకోడీలు తెచ్చి సుబ్బారావుకిచ్చింది. తనో నాలుగు తిని కొడుక్కి నాలుగు పెట్టింది.

ఆ రాత్రి ఆనందంగానే గడిచింది.

ఒక రాత్రివేళ మాంచి నిద్రలోంచి తుళ్ళిపడి లేచాడు సుబ్బారావు.

దడదడలాడుతూ గభీమని వంటగదికుడి చెంప కూలిపోయింది. సీతామహాలక్ష్మి ఆ చప్పుడికి చక్కున లేచికూచుంది. ఏం జరిగిందో సులభంగానే భోధపడింది. మంచంమీద కూచుని అలా మ్రాన్పడిపోయింది చలనం లేకుండా. ఏ ప్రమాదం జరుగుతుందో ఏం దారి దేవుడా అని బెంగటిల్లి తోంది. ఏ ప్రమాదం అయితే జరగకూడదు దేవుడా అని వెయ్యి దేవుళ్ళకి వెర్రిగా మొక్కుకుందో– ఆ ప్రమాదం జరగనే జరిగిపోయింది. ఏ దేవుడూ ఇహను రక్షించలేడు.

పిల్ల లిద్దరూ మొదు నిద్రపోతు...

" ఇంకా నయమే. పగటివేళ కూలింది కాదు. చంటిదీ నువ్వూగాని అక్కడే వుంటే." సగంలోనే ఆపేశాడు సుబ్బారావు.

సీతామహలక్ష్మికి ఏడుపు తన్నుకొచ్చేస్తుంది. భుజంమీద చెయ్యివేసి దగ్గిరికి తీసుకున్నాడు.

అవతల కప్పలు భయంకరంగా బెకబెకలాడుతున్నాయి.

చిన్న చిన్న తుంపర్లు యింటి పెంకులమీద పడి మెత్తటి చప్పుడు చేస్తున్నాయి. యిలకోళ్ళు ప్రాణాంతకంగా గీపెడుతున్నాయి.

ఇద్దరికీ నిద్రపట్టలేదు. మహా అయితే రెండున్నరో, మూడో అవుతుందిగావును గంటకో గడియకో తెల్ల వారుతుందనగా కళ్ళు మండి, బగువెక్కి రెప్పలు పడ్డాయి. కలతనిద్ర- చెదురు మదురు బెదురు నిద్ర. మెలుకువొచ్చేసరికి తెల్లగా తెల్లవారింది. సీతాలు లేచి మంచం మీంచి కాళ్ళు కిందికి పెట్టింది. పాదాలు తడి సేలా చల్లగా వర్షపునీరు. మొగుణ్ణి లేపింది. చెరువుగండి కొట్టేసి వుంటుంది. కళ్ళు నులుపుకుంటూ బయటికొచ్చాడు.

చంటిది లేచి గుక్క పట్టి ఒకటే యేడుపు....

ఒక రాత్రిమీద పెద్దవర్ష మేపడింది. చెరువు పొంగి దక్షిణపు గట్టు గండి కొట్టేసింది. ఊళ్ళోకి వచ్చి పడిపోయింది గంగ. పల్లాన వున్న గొడు వీధిలో కొంపలు ఒక పాతిక, ముప్ఫయిదాకా మునిగిపోయాయి. సుబ్బారావున్న వీధిలో చాలా యిళ్ళల్లోకి నీరొచ్చేసింది. వీధి మొగనున్న పాత మేడ వెనక గోడ కూలిపోయి పక్కవాళ్ళ పెరట్లోని నుయ్యి కప్పడిపోయింది. చుట్టూ ఎటుచూసినా నీరు. జనం ఏడుపు.

రక్తమూ, కన్నీరూ కలగలిపిన రసాయనంలా ఎర్రగా బురద నీరు– వరదనీరు.

చంటిపిల్ల ఒక్కటే యేడుపు– గుక్కపట్టేసింది.

పాలు వెచ్చబెడదామంటే బొగ్గులకుంపటీ స్టౌ ఏవీ? కూలిన యింటి కప్పు పెంకుల్లో కూరుకుపోయి వున్నాయి. అగ్గి పెట్టె నీళ్ళల్లో తేలుతుంది, పైట పక్కకి తీసి పాలందించి చంటిదానికి.

సుబ్బారావు వూచ పట్టుకుని గడప కింద కన్నంలోంచి నీళ్ళు బైటికితోస్తున్నారు. సుందరం అయోమయంగా చుట్టూ చూస్తున్నాడు. వాడు ఎనిమిదేళ్ళ జీవితంలో ఎన్నడూ యింత నీరు చూసి వుండడు- చూసినా ఇలా యింట్లో అసలు చూసి వుండదు. సుందరమేనన్న మాటేమిటి, సుబ్బారావూ చూడలేదు, సీతామహలక్ష్మి చూడలేదు.

పాలు యివ్వటం ఆపి, చంటిదాన్ని మొగుడు చేతికిచ్చి లేచింది సీతామహలక్ష్మి. వంట గదిలోకి వెళ్ళింది.

"యిలారండి యిలారండి– చూశారా అమ్మో– కొంప మునిగింది దేవుడో–" అంటూ కేకలు వేసింది. సుబ్బారావు గబగబా పరుగుతీశాడు. వెనక సుందరం. నిన్న తెచ్చిన పది కేజీలున్న బియ్యపు డబ్బా తిరబడిపోయి. నొక్కుకుపోయింది. బియ్యం అన్నీ మట్టిపాలు,

"నిన్న సాయంత్రం, బియ్యం డబ్బా అవతల గదిలో మంచంకింద పెట్టేద్దాం అనుకుంటూనే మర్చిపోయేనండి– ఎంత పాపిష్టిదాన్ని– యిప్పుడేం దారి తండ్రీ ఒక్క కేజీ గావును నిన్న తీశాను– తక్కిన తొమ్మిది కేజీలూ నేలపాలయి పోయాయి నాయనా-" సీతాలు గుండె బెగిలిపోయింది. సుబ్బారావుకు చికాగ్గా వుంది. భయంగా, బెదురుగా, అసహ్యంగా కూడా వుంది. అంతులేని అందోళనగా గుండె గబగబా కొట్టుకుంటోంది.

"చాలుచాల్లే- ఏడిస్తే వస్తాయా-" అన్నాడు సుబ్బారావు. పద్దెనిమిది రూపాయల సరుకు. దాని సంగతలా వుంచి మళ్ళీ ఆ తాతాజీ అప్పిస్తాడా! యిల్లు కూలిందంటే యెందుకివ్వడూ-

జనం వస్తున్నారు. పరామర్శిస్తున్నారు.. జనం.... జనం-

గదిలో నీరు కొంచెం కొంచెం తీసింది. సమయం ఏడుకావొస్తుంది. కాఫీ తాగలేదు. ఇన్ని నీళ్ళు తెచ్చి మొఖం కడుక్కోవడం పూర్తిచేసి ఫ్లాస్కుపట్టుకుని- నీళ్ళల్లోంచి రోడ్డుమీదకి బయలు దేరాడు. మోకాళ్ళ వరకూ నీళ్ళు.... తూర్పున తెల్లటి మేఘాలమాటు నుంచి పొద్దు కనబడుతూనే వుంది. పడమటి వేపు మళ్ళీ నల్లమబ్బులు ముంచుకొచ్చేస్తున్నాయి. తన నీడ తనకు కాళ్ళచుట్టూ నీళ్ళల్లో కనబడుతోంది. చుట్టూ నల్లమబ్బులు కూడా కనబడుతున్నాయి. తనా బురదనీళ్ళల్లో, వరదనీళ్ళల్లో, నల్లమబ్బుల్లో మునిగిపోయినట్టున్నాడు. దిన దినగండం నూరేళ్ళాయిషులాంటి మధ్య తరగతి బ్రతుకుల్లో నల్లమబ్బులు కాక మరేమిటి? కష్టాల కడలికాక యింకేమిటి? చీకటి చినుకులుకాక మరేమిటి? సుబ్బారావు నీళ్ళల్లోంచి రోడ్డుమీదకొచ్చేశాడు. ప్యాంటు ఎంత మడతపెట్టినా తడిసేపోయింది. రోడ్డు మీంచి యింటి వేపు చూశాడు. ఏడుపు మొహంతో సీతామహలక్ష్మి గడపలో నిలబడింది. సుందరం బిక్క చచ్చిపోయి నుంచున్నాడు. ఇంటిచుట్టూ నీరు.... నీరు.... నీరు.... ఆ మధ్య దరి గానని నావలా తన ఇల్లు... సంసారం.

గబగబా ముందుకు నడిచాడు. తలెత్తివెనక్కి చూడదలుచుకోలేదు. నల్లమబ్బులు తరుముకొస్తున్న సంగతి తెలుస్తూనే వుంది. రానీ.... రానీ.... గబగబా ఫ్లాస్కు పట్టుకు నడుస్తున్నాడు. ఆ అడుగులు స్థిరంగానూ, ధైర్యంగానూ వేస్తున్నాడు. ముందుకే నడుస్తున్నాయతని కాళ్ళు.... నల్ల మబ్బులు అతని వెనకే వుండిపోయాయి.

( 1974లో విశాఖ జిల్లాలో విపరీతంగా నిండా మూడునెలలు కురిసిన వానలు, వచ్చిన వరదలు దృష్టిలో వుంచుకుని రాసిన కథ. ప్రచురణ : జయశ్రీ, నవంబర్ – 1981, 26-11-75.)